ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 37.0 ; కనిష్ఠం : 24.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:35 (గురువారం సాయంత్రం)
సహర్: 5:00 (శుక్రవారం ఉదయం)

స్వయం ఉపాధి బడ్జెట్



సోమశిల వద్ద కృష్ణానది అంచున సుందర దృశ్యం

బడ్జెట్ పత్రాలున్న బ్యాగ్‌తో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం
- గతంలోనూ ఈ శాఖల ద్వారానే స్వయం ఉపాధి కోసం రుణాలు
- సాగునీటి ప్రాజెక్టులకు గతేడాది కంటే తగ్గిన కేటాయింపులు
- ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు ప్రతిపాదన
- పీఆర్‌ఎల్‌ఐలో కేపీ లక్ష్మీదేవిపల్లి నిర్మాణం చేస్తామని ప్రభుత్వం స్పష్టం
- నల్లమల అడవిలో టూరిజం అభివృద్ధికి రూ.242 కోట్లు

మహబూబ్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత బడ్జెట్‌తో పోలిస్తే.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివిధ కార్పొరేషన్లలో యువతకు స్వయం ఉపాధి పథకాల కోసం ఈ సారి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలకు కేటాయింపులు ఎక్కువగా చేశారు. గతంలోనూ ఈ శాఖల ద్వారా ఆ వర్గాల వారు స్వయం ఉపాధి పొందడం కోసం వివిధ రకాల సబ్సిడీతో రుణాలు అందించేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ రుణాలను నిలిపేసింది. తర్వాత గత టర్మ్ చివరి రెండు సంవత్సరాల్లో దళితబంధు, బీసీ బంధు, మైనారిటీ బంధు పథకాలను తెచ్చినా వాటి అమలు పూర్తికాలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా, రెండో పూర్తి స్థాయి బడ్జెట్‌లో ఈ శాఖలకు తిరిగి జవసత్వాలు తెచ్చేలా కేటాయింపులు చేసిందని చెప్పొచ్చు. స్వయం ఉపాధి పొందాలనుకునే వారు ఈ శాఖలకు దరఖాస్తు చేసుకుని, వచ్చిన రుణంతో జీవించడానికి వీలు పడుతుంది. అలాగే ప్రతీ నియోజకవర్గానికి ఒక అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని కూడా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది.

నల్లమల పర్యాటకానికి రూ. 242 కోట్లు..

పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.775 కోట్ల బడ్జెట్ కేటాయింపులు చేయగా, అందులో రూ. 242 కోట్లు నల్లమలకు కేటాయించింది. కృష్ణానదిలో జెట్టీలు, లాంచి స్టేషన్లు, వాటర్ స్పోర్ట్స్, హౌస్‌బోట్లు, నదీ ఉత్సవాలను ప్రోత్సహించాలని నిర్ణయించింది. అందుకు అనువైన ప్రాంతాలు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో ఉన్నాయి. అలాగే అమ్రాబాద్‌లో అటవీ అతిథి గృహాల అభివృద్ధి, సఫారీ సేవలు, ట్రెక్కింగ్ మార్గాలు, సోమశిల వద్ద బోటింగ్, క్యారవన్ క్యాంపింగ్ సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా మరో 18 ప్రాంతాలను ఎకో టూరిజం కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. యాంటీ బయాటిక్స్, సింథటిక్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, న్యూట్రాస్యూటికల్స్, కాస్మోటిక్స్ పరిశ్రమలను ప్రోత్సహించనుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని అమ్మాపూర్‌లో ఉన్న కురుమూర్తి దేవాలయం అభివృద్ధిపై ప్రస్తావన చేసిన భట్టి.. ఇప్పటికే రూ.110 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమైనట్లు తెలిపారు.

ఆరు గ్యారెంటీలకు నిధులు..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు నిధుల కేటాయింపులు చేసింది. రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు కేటాయించగా.. ఉమ్మడి జిల్లాలో 24.38 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇందుకు గాను రెండు సీజన్లకు కలిపి రూ.2438 కోట్ల నిధులు అవసరం అవుతాయి. చేయూత స్కీంకు రూ.14,861 కోట్లు నిధులు కేటాయించారు. ఇందిరమ్మ ఇళ్లకు 12,571 కోట్లు కేటాయించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రస్తుతం ఉన్న 12 నియోజకవర్గాల్లో 42 వేల ఇళ్ల పూర్తికి రూ.2,100 కోట్లు అవసరమవుతాయి. విడతలవారీగా చెల్లించినా ఈ బడ్జెట్‌లో కనీసం రూ.1,000 కోట్లు ఈ జిల్లాలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం 1.30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్ కార్డులను జారీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకోసం రూ.3 వేల కోట్ల బడ్జెట్‌ను సబ్సిడీ కోసం ప్రవేశపెట్టింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.25 లక్షల మంది ఇటీవల రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆత్మీయ భరోసా పథకానికి రూ.600 కోట్లు కేటాయించగా.. ఉమ్మడి జిల్లాలోనే 27,116 మంది అర్హులు ఉన్నారు. వారికే రూ.54 కోట్ల వరకు అవసరం ఉంటుంది. ఇక ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, గృహజ్యోతి, సన్నరకాలకు సబ్సిడీ, రాజీవ్ ఆరోగ్యశ్రీకి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు.

అంబులెన్స్‌లు లేని మండలాలకు కొత్త వాహనాలు కేటాయిస్తామని చెప్పగా.. ఇప్పటికే అందుబాటులో ఉండి, వినియోగించని అంబులెన్స్‌ల నిర్వహణపై ఎలాంటి ప్రకటన చేయలేదు. సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న అంగన్‌వాడీల్లో పోస్టుల భర్తీకి కూడా రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

సాగునీటి ప్రాజెక్టులకు రూ. 2,767.85 కోట్లు..

రాష్ట్ర ప్రభుత్వం

(మిగతా 7లో..)

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- గద్వాల జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలు, హాజరుకానున్న 7,717 మంది విద్యార్థులు
- ‘ఆంధ్రజ్యోతి’ ఇంటర్వ్యూలో ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని



గద్వాల సర్కిల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి జోగుళాంబ గద్వాల జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్‌ఘని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 40 పరీక్షా కేంద్రాల్లో 7,717 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. మాస్ కాపీయింగ్ పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని బుధవారం తన ఛాంబర్‌లో ‘ఆంధ్రజ్యోతి’ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. 40 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రతీ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం. రవాణా సౌకర్యం లేని ప్రాంతాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాం.

ఎంత మంది విద్యార్థులు హాజరు కానున్నారు?

జిల్లా వ్యాప్తంగా 184 పాఠశాలల నుంచి 7,717 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 3,866 బాలికలు, 3,851 బాలురున్నారు. 7,600 మంది రెగ్యులర్, 117మంది ప్రైవేట్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు?

ఈ నెల 21న ప్రారంభమై వచ్చే 4వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. 40 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 40 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్, 40 మంది సిట్టింగ్ స్క్వాడ్స్, 8 మంది సీ సెంటర్స్ కస్టోడియన్ ఆఫీసర్స్, 18 మంది స్టోరేజ్ పాయింట్ కస్టోడియన్స్, మూడు బృందాలతో ఫ్లయింగ్ స్క్వాడ్స్, 431 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నారు.

ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి?

గతేడాది కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల కూడా నిర్వహించారు. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో జోగుళాంబ గద్వాల జిల్లా మెరుగైన స్థానంలో ఉంటుందనే విశ్వాసం ఉంది.

పది పరీక్షలు రాసే విద్యార్థులకు మీరిచ్చే సూచనలు...?

విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షా కేంద్రానికి వెళ్లాలి. పరీక్షకు అవసరమయ్యే సామగ్రిని మరువకుండా జాగ్రత్తపడాలి. భయపడకుండా పరీక్షా రాయాలి. ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్న నమ్మకంతో విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలి. పరీక్ష రాసే ప్రతీ పదో తరగతి విద్యార్థికి ఆల్ ది బెస్ట్... అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నా.

ముగిసిన ఇంటర్ ‘ప్రథమ’ పరీక్షలు



- హాస్టళ్ల నుంచి ఇళ్లకు విద్యార్థులు

6

కూలీల సంఖ్య పెంచాలి

- బైక్‌పై వెళ్లి ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్ బీఎం సంతోష్



పెద్దొడ్డిలో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇస్తున్న కలెక్టర్

గద్వాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ బీఎం సంతోష్ సూచించారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని తాటికుంట, పెద్దొడ్డి, మల్దకల్, అమరవాయి, గద్వాల మండలం కుర్వపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. పెద్దొడ్డి గ్రామంలో ఉపాధి హామీ పనుల వద్దకు వాహనాలు వెళ్లే సౌకర్యం లేకపోవడంతో బైక్‌పై వెళ్లాడు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి అప్‌డేట్ లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ పనికి సంబంధించిన రికార్డులతో పాటు మస్టర్లను, కూలీల జాబ్‌కార్డులను అప్‌డేట్ చేసి ఉంచాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయం వేళల్లో పనులు పూర్తి చేసుకోవాలన్నారు. నర్సరీలను పరిశీలించి మొక్కలకు ప్రతీ రోజు నీరు పోయాలని సూచించారు. తాగునీటి పైపులు లీకేజీలు లేకుండా చూడాలని, రోడ్ల వెంట మురుగునీరు నిల్వ ఉండొద్దని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అమరవాయి గ్రామంలో ఉపాధి పథకం ద్వారా వేస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి

- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి
- కల్వకుర్తి ఆసుపత్రి ముందు ఆందోళన



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

7

‘రాజకీయ ప్రసంగంలా ఉంది’

- బడ్జెట్‌పై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శ

వనపర్తి అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాజకీయ ప్రసంగంలా ఉందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా అబద్దాల చిట్టా చదివారని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన వికాసాన్ని 15 నెలల కాంగ్రెస్ పాలనలో విధ్వంసం చేశారని మండిపడ్డారు. అజ్ఞానం, అనుభవ రాహిత్యం, అహంకారం వెరసి తెలంగాణలో ప్రస్తుతం నడుస్తున్న పాలన అని విమర్శించారు. పదేళ్లలో పచ్చబడ్డ తెలంగాణను ఎండబెట్టి చోద్యం చూస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రసంగంలో అన్ని అబద్దాలే వండి వార్చారని మండిపడ్డారు. ధ్వంసం, విధ్వంసమే కాంగ్రెస్ రచన అని, నవ నిర్మాణాన్ని నరనరాన నింపుకుని పని చేసిన కేసీఆర్ సర్కార్ గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు



రఫీ(ఫైల్)



హరిజన బీసన్న (ఫైల్)

ఎర్రవల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలైన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలోని కోదండాపురం స్టేజీ దగ్గర మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. కోదండాపురం ఎస్‌ఐ మురళి కథనం ప్రకారం మానవపాడు మండలం జల్లాపురం గ్రామానికి చెందిన హరిజన బీసన్న(36), రఫీ(62)లు కలిసి ద్విచక్ర వాహనంపై తమ పని నిమిత్తం వచ్చి కోదండాపురం దగ్గర అర్ధరాత్రి జాతీయ రహదారిని దాటుతున్నారు. అదే సమయంలో బెంగళూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న కారు అతి వేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలతో రక్తస్రావమై ఉన్న హరిజన బీసన్న, రఫీలను హైవే అంబులెన్స్ సిబ్బంది గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

నీటికోసం వన్యప్రాణుల ఆరాటం


- నల్లమలలో ఎండుతున్న జలధారలు, చెలిమలు
- నీటి సౌకర్యం కల్పించే పనిలో అటవీశాఖ అధికారులు
- సోలార్ మోటార్ల ఏర్పాటుకు ప్రాధాన్యం

నల్లమలలో నీరు లేక నిరుపయోగంగా ఉన్న సాసర్ పిట్





సాసర్ పిట్‌లో నీటిని నింపుతున్న అటవీశాఖ అధికారులు



సాసర్ పిట్‌లో నింపిన నీటిని తాగుతున్న జింకలు

అచ్చంపేట, మార్చి19 (ఆంధ్రజ్యోతి): నల్లమల అడవి పెద్ద పులులు, చిరుతలు, ఎన్నో రకాల వన్య ప్రాణులకు నెలవు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 20 రెవెన్యూ మండలాల్లో నల్లమల విస్తరించి ఉంది. ఈ అడవిలో పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, అడవి కుక్కల వంటి మాంసాహార జంతువులతో పాటు శాఖహార జంతువులైన సాంబర్, మనుబోతు, చుక్కలదుప్పి, అడవిపందులు, ముళ్లపంది, చౌసింఘాతోపాటు మరెన్నో రకాల వన్య ప్రాణులు జీవిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం 32పులులు, 176 చిరుత పులులు, 250 ఎలుగుబంట్లు, 10వేలకు పైగా ఇతర వన్య ప్రాణులు జీవిస్తున్నాయి. ఈ జంతువులన్నీ తాగునీటి కోసం తండ్లాడుతున్నాయి. ప్రతీ ఏటా వేసవిలో ఎదురయ్యే నీటి సమస్యను అధిగమించేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 2వేల హెక్టార్లలో ఒక సోలార్ మోటర్‌ను ఏర్పాటు చేసి ఎటూ 4వేల హెక్టార్ల పరిధి వరకు ఆ ప్రాంతంలో సాసర్‌పిట్లకు నీరు అందిస్తున్నారు. స్వచ్ఛంధ సంస్థలు, దాతల సహకారంతో నల్లమల లో సోలార్ పంపులను ఏర్పాటు చేశారు.

ఎండుతున్న వాగులు వంకలు

నల్లమల అభయారణ్యంలో జీవిస్తున్న జంతువులకు జీవనాధారంగా ఉన్న ఎన్నో వాగులు, వంకలు ఎండిపోతున్నాయి. దీంతో నీరు లభించే ప్రాంతాలకు వన్య ప్రాణులు వెళ్తున్నాయి. అక్కడే మాటువేసిన మాంసాహార జంతువులు, వేటగాళ్ల చేతుల్లో చిక్కి మృత్యువాత పడుతున్నాయి. ప్రధానంగా వటువర్లపల్లి సమీపంలోని కానుగుల చెరువు, తుర్కబండల వాగు, కిన్నెరగుండం, జువికాలువ, ధారవాగు, మక్కలేటివాగు, తురముబండలు, సుద్దబొక్కల వాగు, మేకపోతుగుండం, మల్లెల తీర్థం వాగు, పొగనురువాగు వంటి జలవనరులు ఎండల తీవ్రతతో ఎండిపోతున్నాయి.



సాసర్ పిట్‌లో నింపిన నీరు తాగేందుకు వచ్చిన పులి(ఫైల్)



దాహంతో ఖాళీ బాటిల్‌లో నీటిని వెతుకుతున్న వానరం

శాశ్వత పరిష్కారానికి కృషి

నల్లమల అభయారణ్యంలో వేసవిలో రెండు ప్రధాన సమస్యలు ఎదుర్కొంటున్నాం. అడువులకు నిప్పురాజుకోవడం, వన్యప్రాణులకు నీటి సమస్య. ఈ రెండు సమస్యలను పరిష్కరించుకునేందుకు క్షేత్రస్థాయిలో మా సిబ్బంది కృషి చేస్తున్నారు. ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగిన తక్షణమే అక్కడికి వెళ్లి ప్రమాదం నివారించేందుకు చర్యలు చేపడుతున్నాం. వన్యప్రాణులకు అందు బాటులో నీటి సౌకర్యం ఉండేలా చెక్‌డ్యాంలు ఏర్పాటు చేస్తున్నాం. నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సోలార్ పంపుసెట్లను ఏర్పాటు చేస్తున్నాం. కొన్ని చోట్ల సాసర్ పిట్లను ఏర్పాటు చేసి నీళ్లు నింపుతున్నాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో



అభయారణ్యంలో వన్యప్రాణుల దాహం తీరుస్తున్న బౌరాపూర్ చెరువు

స్పోర్ట్స్ బాక్స్

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన శిల్పను అభినందిస్తున్న పశువైద్యుల బృందం

మాగనూరు/ ఆత్మకూరు/ మక్తల్/ గద్వాల అర్బన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మాగనూరు మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు బి.దీప, వనపర్తి జిల్లా ఆత్మకూరు వెటర్నరీ ఆసుపత్రిలో వెటర్నరీ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న శిల్ప ఖోఖో సివిల్ సర్వీసెస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. జనవరి 23 నుంచి 24వ తేదీ వరకు సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీలో ఈ నెల 21 నుంచి 24 వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున వారు పాల్గొననున్నారు. ఉపాధ్యాయురాలు దీపను నారాయణపేట డీఎస్‌వో వెంకటేశ్‌శెట్టి, మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అభినందించారు. వెటర్నరీ అసిస్టెంట్ శిల్పకు ఏడీ మిరాజ్ అహ్మద్, పశు వైద్యులు రమేశ్, వీఏఎస్ నిర్మల, జేవీవోలు అభినందనలు తెలిపారు. అలాగే జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన గౌరీప్రియ, యశోధ, దేవేందర్‌లు సివిల్ సర్వీసెస్ నేషనల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని డీవైఎస్‌వో పి.జితేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరీప్రియ ధర్మారం హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా, యశోద మల్దకల్ మండలం మద్దెలబండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా, దేవేందర్ వేముల పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. వీరిని ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి ఆనంద్‌కుమార్ అభినందించారు.



జాతీయ స్థాయి ఖోఖో పోటిలకు ఎంపికైన బి.దీప



ఖోఖో రాష్ట్ర జట్టు జట్టు కెప్టెన్ బి.రూప



గౌరీ ప్రియ



యశోద

‘ఖేలో ఇండియా’కు పేట జిల్లా వాసి



ఖేల్ ఇండియాకు పేట జిల్లావాసి కనకప్ప

నారాయణపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, దామరగిద్దకు చెందిన కనకప్ప టి-44 కేటగిరీ లాంగ్‌జంప్‌లో పారా అథ్లెటిక్స్ ఖేలో ఇండియా పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి పోటీల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణ బుధవారం ఆయనను అభినందించి, సన్మానించారు.

మెడికల్ కళాశాల విద్యార్థుల విజయం



వైద్య విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ డా. రమేష్

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని మల్లారెడ్డి మెడికల్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్మెడిక్స్ క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ఘన విజయం సాధించారు. వారిని బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేశ్ అభినందించారు. తెలంగాణలోని అన్ని ప్రభుత్వ వైద్యకళాశాలల విద్యార్థులకు ఇటీవల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహబూబ్‌నగర్ వైద్య కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి, బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు డాక్టర్ కిరణ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టోర్నీలో పతకాలు సాధించాలి

» ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్



జాతీయస్థాయి అర్చరీ టోర్నీకి ఎంపికైన జిల్లా క్రీడాకారుతో జిల్లా అర్చరీ సంఘం సెక్రటరీ రాంచందర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్చరీ జాతీయస్థాయి టోర్నీలో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని అర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సెక్రటరీ రాంచందర్ ఆకాంక్షించారు. జాతీయ స్థాయి టోర్నీకి ఎంపికైన క్రీడాకారులను మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరులో ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న అర్చరీ టోర్నీలో వారు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు విలువిద్యలో ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎదగడం అభినందనీయం అన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకా రులకు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోచ్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

ఆర్చరీ అండర్-10 విభాగంలో శ్రీహిత, సిద్ధిక్ష, ఆయేజా ఫాతిమా, రోషన్, హిమనీష్ రోహన్ ఎంపికయ్యారు. అండర్-13లో సమీక్ష, షేర్వానీ, అయేషాఫాతిమా, సానియా, డి.సమీక్ష, కృతిక్ శ్రీవాస్తవ్, మణిశ్వర్, చంద్రనీల్ ఉన్నారు. అండర్-15లో సానియా, సమీక్ష, షేర్వానీ, సమీక్షగౌడ్ ఎంపికయ్యారు.



వనపర్తిలో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు





మహబూబ్‌నగర్ బాలికల కళాశాల నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పరీక్షలు ముగియడంతో పాలమూరులో బై..బై.. చెప్పుకుంటున్న విద్యార్థినులు



పరీక్షలు బాగా రాసమని ఆనందంలో ఉన్న విద్యార్థులు



ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ముగిసిన ఇంటర్ ‘ప్రథమ’ పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ గద్వాల సర్కిల్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. ఈ నెల ఐదున ప్రారంభమైన పరీక్షలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగాయి. చివరి రోజు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు ముగియడంతో ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఒకరికొకరు బాయ్‌బాయ్, టాటా చెప్పుకుంటూ ఇంటిబాట పట్టారు. ప్రైవేట్, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు దాదాపు నెల పది రోజల పాటు వేసవి సెలవులు ఉండటంతో బ్యాగులు, పెట్టెలు సర్దుకొని తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల వెంట సొంత ఊర్లకు ప్రయాణమయ్యారు. దీంతో జిల్లా కేంద్రాల్లోని బస్టాండ్లు విద్యార్థులతో కిక్కిరిశాయి.

» ఇంటి బాట పట్టిన విద్యార్థులు

● మహబూబ్‌నగర్ జిల్లాలోని 36 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 11,154 మంది హాజరు కావల్సి ఉండగా, 10,909 మంది హాజరయ్యారు. 245 మంది పరీక్ష రాయలేదు. జనరల్ విభాగంలో 9,402 మందికి గాను, 9,255 మంది పరీక్ష రాశారు. 147 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,752 మందికి గాను, 1,654 మంది హాజరు కాగా, 98 మంది గైర్హాజరయ్యారు. .

● గద్వాల జోగుళాంబ గద్వాల జిల్లాలోని 14 పరీక్షా కేంద్రాల్లో 4,259 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 4,067 (96 శాతం) మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 3,424 మందికి గాను 3,295 (96 శాతం) మంది, వృత్తి విద్య విభాగంలో 835 మందికి గాను, 772 (92 శాతం) మంది హాజరాయ్యారు. గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ధరూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పరీక్షల జిల్లా కన్వీనర్, డీఐఈవో హృదయరాజు తనిఖీ చేశారు.

● నారాయణపేట జిల్లాలోని 18 పరీక్ష కేంద్రాల్లో 4,692 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా, 4,544 మంది హాజరయ్యారు. 148 మంది పరీక్ష రాయలేదు. జనరల్ విభాగంలో 4157కు గాను, 4033 మంది పరీక్ష రాశారు. 124 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 535 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 511 మంది హాజరయ్యారు. 24 మంది హాజరు కాలేదు. జిల్లా నోడల్ అధికారి సుదర్శన్‌రావు జిల్లా కేంద్రంలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 7,058 మంది ఉండగా 6,634 మంది విద్యార్థులు హాజరు కాగా 424మంది హాజరు కాలేదు. అందులో జనరల్ విద్యార్థులు 5604 విద్యార్థులకుగాను 5310మంది విద్యార్థులు హాజరు కాగా 294మంది హాజరు కాలేదు. అదేవిధంగా ఒకేషనల్‌లో 1454మంది విద్యార్థులకుగాను 1324మంది విద్యార్థులు హాజరు కాగా 130మంది విద్యార్థులు హాజరు కాలేదు.

● వనపర్తి జిల్లాలో 7,032 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 6,753 (97శాతం) మంది హాజరయ్యారు. 279 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 6,016 మంది హాజరు కావాల్సి ఉండగా, 5,812 మంది పరీక్ష రాశారు. 204 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,016 మంది విద్యార్థులకు గాను, 941 మంది హాజరయ్యారు. 75 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.



పాలమూరులో బస్సు ఎక్కుతున్న విద్యార్థి





విద్యార్థులు, ప్రయాణికులతో రద్దీగా ఉన్న మహబూబ్‌నగర్ బస్టాండ్



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

కస్తూర్బాలో కలెక్టర్ బస



కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

భూత్పూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భూత్పూర్ మండల కేంద్రం లోని కేజీబీవీ బాలికల విద్యాలయంలో కలెక్టర్ విజయేంది ర బోయి బుధవారం రాత్రి బస చేశారు. అంతకుముందు వి ద్యార్థులతో విద్యాల యంలో నెలకొన్న వసతులు, సౌకర్యా లపై అడిగి తెలు సుకున్నారు. ఏమై న సమస్యలు ఉం టే వెంటనే అధికా రుల దృష్టికి తీసుకె ళ్లి పరిష్కరించేలా చేస్తామన్నారు. అనంతరం కిచెన్, స్టోర్ గదుల ను పరిశీలించారు. డీఈవో ప్రవీణ్‌కుమార్, మహిళ శిశు సంక్షేమ శాఖాధికారి జరీనా బేగం, మార్కెటింగ్ అధికారిణి బాలమణి, బీసీ సంక్షేమాధికారి ఇందిర ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన



ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం సభ్యులు

అచ్చంపేటటౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం కాయకల్ప టీం సభ్యులు పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవల తో పాటు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, పచ్చదనం పరిశు భ్రత, పారిశుధ్యం నిర్వహణ అంశాలతో ఆసుపత్రిలో ఉపయోగిస్తున్న పరికరాల నాణ్యత గురించి పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. కాయకల్ప టీం అధికారి డాక్టర్ ప్రదీప్, రోగులకు సరిపడా మందులు ఉన్నాయా అని ఫార్మాసిస్టులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు, సిబ్బంది, సాయిరాం, శంకర్, గౌస్ పాషా, లక్ష్మి పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

» పరారీలో మరో ఇద్దరు

» బంగారం, నగదు స్వాధీనం

» వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పగటి పూట ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వనపర్తి పట్టణానికి చెందిన జలగరి ముత్తు, దుల్లోల్ల రాజు తాగుడుకు, జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలని చోరీలకు పాల్పడుతున్నారు. గతంలో గొర్రెల చోరీ కేసులో జైలుకు వెళ్లారు. అక్కడ వారికి చోరీ కేసులో నిందితుడు, జడ్చర్లకు చెందిన మూర్తి అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. అతడు వీరికి ఇళ్లలో దొంగతనాలపై సూచనలు సలహాలు ఇచ్చాడు. దీంతో వీరిద్దరూ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడ్డారు. వాటిలో ఓ కేసుకు సంబంధించి బుధవారం పోలీసులు వారిని అరెస్టు చేశారు. వారికి సహకరిస్తున్న బొలమోని అంజి, కిట్టులపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. వారిద్దరూ పరారీలో ఉన్నారని, త్వరలో పట్టుకుంటామని చెప్పారు. వీళ్ల నలుగురూ వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 17 కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 5 లక్షల విలువైన బంగారం, రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీసీఎస్ సీఐ రవిపాల్, సీఐ కృష్ణ, ఎస్ఐలు హరిప్రసాద్, జలంధర్ రెడ్డి, రాణి, జయన్న, రామరాజు, కానిస్టేబుళ్లు స్వామి, మురళి, అశోక్, నవీన్‌గౌడ్‌లకు రివార్డు అందించి, ఎస్పీ అభినందించారు.

నలుగురు దొంగల అరెస్ట్

పెబ్బేరు రూరల్ : పైపులు ఎత్తుకెళ్లిన ఘటనలో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ హరిప్రసాద్ రెడ్డి బుధవారం తెలిపారు. జాతీయ రహదారిపై చేపడుతున్న పనుల్లో భాగంగా, అక్కడే ఉంచిన రూ.2.50 లక్షల విలువైన పైపులను ఎత్తుకెళ్లారు. దీనిపై కాంట్రాక్టర్ గోవింద్ బుధాజీ ఈ నెల 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు సుక్కన, మనపాటి శివ, ఎరుకలి శివకుమార్, ఎరుకలి పరశురాముడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సామగ్రిని భద్రంగా ఉంచుకోవాలని కాంట్రాక్టర్‌కు ఎస్ఐ సూచించారు.



నాయినోనిపల్లిలో వరి పంటకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న రైతు వార్ల చెన్నయ్య

ట్రాక్టర్ ట్యాంకర్‌తో వరి పంటకు నీరు

హన్వాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన వరి పంట చేతి కొచ్చే సమయంలో నీరు అందకపోవడం తో దిక్కుతోచని స్థితిలో ఓ రైతు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నాడు. మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన వార్ల చెన్నయ్య ఎకరా పొలంలో వరి పంట సాగు చేశారు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతో బోరులో నీరు తగ్గిపోయింది. చేతికి వస్తున్న తరుణంలో పంటను కాపాడు కునేందుకు ట్యాంకర్‌కు రూ.500 చెల్లించి నీరు అందిస్తున్నాడు.

బడ్జెట్ కేటాయింపులు భేష్



అయిజ, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అభివృద్ధికి మూ లాధారంగా ఉంది. వ్యవసాయ రంగం, నీటి పారుదల, విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇచ్చింది. శాఖల వారీగా ప్రాధా న్యాన్ని గుర్తిస్తూ అవసరమైన మేర నిధులు కేటా యించారు. రంగాల వారీగా కేటాయింపులు సమపా ళ్లలో ఉన్నాయి. బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉంది.

- ఆంజనేయులు, అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు, అయిజ

రాష్ట్ర బడ్జెట్ నిరాశాజనకం



గద్వాల సర్కిల్, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉంది. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం మినహా ఏవీ నెరవేరలేదు. బడ్జెట్‌లో మహాలక్ష్మి, కల్యాణలక్ష్మికి తులం బంగా రం పథకం, వడ్డీలేని రుణాలు, మహిళలకు ప్రతీ నెల రూ. 2,500 పథకాల ఊసే లేదు. మైనారిటీ మహిళల అభ్యున్నతిపై స్పష్టత లేకుండా పోయింది. మొత్తానికి ఈ బడ్జెట్ మధ్య తరగతి ఆశలపై నీరు చల్లింది.

- సబియా సుల్తానా, గృహిణి, గద్వాల

రుణమాఫీకి నిధులు లేవు



వనపర్తి టౌన్, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో రైతు రుణమాఫీకి, రైతులకు బడ్జెట్ కేటాయించలేదు. రైతు భరోసా కూడా పూర్తిగా ఇవ్వలేదు. దీనిపై ప్రస్తావన తూతూ మంత్రంగానే ఉంది. వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ రుణాలకు నిధులు కేటాయించలేదు. బడ్జెట్ భారీగా ఉంది కానీ, ఆచరణలో అమలు చేసే విధంగా కూడా ఉండాలి. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి కనిపించలేదు. జూరాల ప్రాజెక్టుకు ప్రత్యేక నిధి కేటాయించాలి. మరమ్మతులు, చివరి ఆయకట్టుకు నీరు వచ్చే విధంగా లింకు కాలువల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం

-రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వనపర్తి

గత సంవత్సరం కంటే తగ్గింది



ప్రభుత్వం రూ.304,965 కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.23,108 (7.57 శాతం) కేటాయించింది గత సంవత్సరం రూ.274058 కోట్ల బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయించినది రూ.21,292 కోట్లు (7.77), అంకెల్లో రూ.1816 కోట్లు పెరిగినట్లుగా ఉన్నప్పటికీ, శాతాల్లో చూస్తే గత సంవత్సరం కంటే తగ్గింది. విద్యాశాఖ పరిధిలో ఉన్న 26,067 పాఠశాలలను గాలికి వొదిలేసి, రెసిడెన్షియల్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి మాత్రమే ప్రభుత్వం మాట్లాడుతున్నది. గురుకులాల్లో చదివేది 5.5 లక్షల మంది మాత్రమే, ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో చదివే విద్యార్థులు 16 లక్షల మంది. వారిలో అత్యధికులు బడుగు బలహీన వర్గాల వారు, బాలికలు, వీరికి నాణ్యమైన విద్య అందించడానికి ఈ కేటాయింపులు ఏమాత్రమూ సరిపోవు.

- పలుస శంకర్ గౌడ్, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, వనపర్తి

మహిళలకు సముచిత స్థానం కల్పించలేదు



రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలు, శిశు సంక్షేమానికి సరైన నిధులు కేటాయించలేదు. కేవలం రూ.2,862 కోట్లు కేటాయిస్తే మహిళలకు ఉపయోగపడుతుందని ఎలా అనుకోవాలి. ఈ తక్కువ బడ్జెట్‌తో కోటి మంది మహిళలను కోటీశ్వరులను ఎలా చేస్తారు. మహిళలను నిజంగా కోటీశ్వరులుగా చేయాలనుకుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించి, బడ్జెట్‌ను పెంచి చూపించాలి.

- లక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి, వనపర్తి

విద్యాశాఖకు నిధుల పెంపు హర్షణీయం



కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో విద్యాశాఖకు నిధుల పెంపు హర్షణీయం. కానీ మరింత ఎక్కువగా కేటాయించి ఉంటే విద్యావ్యవస్థ గణనీయంగా మార్పు చెందేది. ఉన్నత విద్యతో పోలిస్తే పాఠశాల విద్యకు సముచిత స్థానం కల్పించారు. కానీ గురుకులాల్లో 5.5 లక్షల మంది చదువుకుంటుండగా, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుకుంటున్న వారు 16 లక్షల మంది ఉన్నారని గుర్తించాల్సింది. ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు, బకాయిల చెల్లింపు అంశాల్లో త్వరితగతిన న్యాయం చేయాలి.

- బ్యాంగి కృష్ణ ప్రసాద్, టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సహాధ్యక్షుడు, కొల్లాపూర్

విద్యారంగానికి అధిక నిధులు



పాలమూరు యూనివర్సిటీ, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి రూ. 23,108 కోట్లు కేటాయించడం శుభ పరిణా మం, విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగపడుతుంది. పరిశ్రమల శాఖకు రూ. 3,525 కోట్లు కేటాయించడం వల్ల కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వ్యవసాయ రంగానికి రూ.24,400 కోట్లు కేటాయించడం వల్ల ఉత్పాదకత పెరుగుతుంది.

- రంగప్ప, అసిస్టెంట్ ప్రొఫెసర్, కామర్స్ విభాగం, పీయూ

మహిళలు, పేదలకు ప్రథమ ప్రాధాన్యం



మహిళలు, పేదలకు బడ్జెట్‌లో ప్రథమ ప్రాధాన్యం లభించింది. ప్రాథమిక విద్యకు పెద్దపీట వేస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఉన్నత విద్యలో భాగంగా ఒక్క విశ్వవిద్యాలయానికి తప్ప మిగతా విశ్వవిద్యాలయాలకు కేటాయింపులు జరగలేదు. యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడంతో పాటు, పరిశోధనలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే బాగుండేది. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించలేదు. వ్యయాలను మాత్రం ఏవిధంగా పంపిణీ చేయాలో తెలియజేశారు.

- డాక్టర్ రాఘవేందర్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎకనామిక్స్ విభాగం, పీయూ

స్వయం ఉపాధి బడ్జెట్

(5వ పేజీ తరువాయి)



నాగర్‌కర్నూల్ జిల్లాలో కొనసాగుతున్న ఏదుల రిజర్వాయర్ పనులు (ఫైల్)

ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు గతేడాది కంటే తక్కువ కేటాయింపులు చేసిందని చెప్పొచ్చు. గతేడాది బడ్జెట్‌లో రూ.2,792.85 కోట్లు కేటాయించగా.. ఈ సంవత్సరం రూ.2,768.85 కోట్లు కేటాయించింది. ఇందులో చాలావరకు నిర్వహణ, అంచనాల పెంపునకే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గతేడాది కంటే స్వల్పంగా బడ్జెట్ కేటాయింపులు ఎక్కువగా చేసినప్పటికీ.. ప్రాజెక్టుకు భారీ ఎత్తున నిధుల అవసరం ఉంది. గతేడాది రూ.1,285 కోట్లు కేటాయించగా.. ఈ ఏడాది రూ.1,714 కోట్లు కేటాయిస్తామని చెప్పింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పీఆర్ఎల్ఐ డిజైన్‌లో ఉన్న కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టకపోగా.. తమ ప్రభుత్వం రిజర్వాయర్‌ను పూర్తి చేస్తుందని భట్టి తన ప్రసంగంలో పేర్కొన్నారు. అలాగే కోయిల్‌సాగర్‌కు రూ.80.75 కోట్లు కేటాయించగా.. గతేడాది ఈ ప్రాజెక్టుకు రూ. 411.74 కోట్లు కేటాయించారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకానికి గతేడాది రూ.129.75 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.143.80 కోట్లు కేటాయించారు. ఒక్క ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల మరమ్మతుకే ఈ బడ్జెట్ సరిపోనుంది. జూరాలకు గత బడ్జెట్‌లో రూ.12 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.15 కోట్లు ఇచ్చారు. సంగంబండకు గతంలో రూ. 187.95 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం 16.21 కోట్లు మాత్రమే కేటాయించారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలకు సంబంధించి ఎలాంటి నిధుల ప్రస్తావన పద్దులో లేదు. ఇక కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి రూ.800 కోట్లు కేటాయించగా.. గతంలో కంటే రూ.85 కోట్లు పెంచారు. కల్వకుర్తి, పీఆర్ఎల్ఐ, నెట్టెంపాడుకు కేటాయింపులు పెరుగగా.. మిగతా ప్రాజెక్టులకు తగ్గిపోయాయి. అయితే మెజారిటీ నిర్వహణ ఖర్చులు, పాత బకాయిలు, రివైజ్డ్ ఎస్టిమేషన్‌కే సరిపోతాయని అంచనా వేస్తున్నారు. రాజీవ్ భీమా ఎత్తిపోతలకు గతంలో లాగే రూ.13.84 కోట్లు కేటాయించారు. ఇందులో అంతర్భాగంగా ఉన్న కానాయపల్లి పునరావాస సమస్యకు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా మోక్షం లభించే అవకాశం లేదు. పెండింగ్ ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఏడాది గడిచినా బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు చేయడం లేదనే విమర్శ వ్యక్తమవుతోంది. అలాగే తుమ్మిళ్ల రిజర్వాయర్లు, గట్టు ఎత్తిపోతల పథకానికి కూడా ఈ బడ్జెట్‌లో నిధుల ప్రస్తావన లేదు.

బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం



గద్వాల టౌన్, (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం జరిగింది. ఎస్సీ, ఎస్టీల కన్నా అధిక జనాభా ఉన్న బీసీలకు కేవలం రూ.11వేల కోట్లు కేటాయించడం సరికాదు. రైతు రుణమాఫీకి సంబంధించి మిగిలిపోయిన రైతులకు కేటాయింపులు జరపకపోగా, రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాలపై ప్రస్తావన లేదు. నిరుద్యోగ భృతి, యూత్ పాలసీకి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపునకు కేటాయింపులు లేకపోవడం విచారకరం. గట్టు ఎత్తిపోతల పథకం నిర్మాణం, ర్యాలంపాడు ప్రాజెక్టు మరమ్మతుకు కేటాయింపులు జరపకపోవడం గర్హనీయం.

- ఆంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి, గద్వాల

విద్యారంగానికి నిరాశాజనకం



బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు నిరాశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది కంటే 0.20 శాతం తగ్గించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న 15 శాతం హామీకి కేటాయింపులు ఆమడ దూరంలో ఉన్నాయి. ఇచ్చిన హామీ మేరకు నిధులు కేటాయించాల్సి ఉండేది.

- వెంకటేశ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

సమతూకం లోపించింది



వార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో సమతూకం లోపించింది. ఆరు గ్యారెంటీల అమలుకు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీల సంక్షేమానికి కేటాయింపులు ఆశాజనకంగానే ఉన్నాయి. విద్యారంగానికి కేటాయింపులు నిరాశను మిగిల్చాయి. వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పినా, కేటాయింపుల్లో తగిన ప్రాధాన్యం దక్కలేదు. పన్నుల వసూలు, జీఎస్టీపై ఆదాయాన్ని పూర్తి స్థాయిగా రాబట్టు కోవడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టమైంది.

- ముత్యాల నాగరాజు, ఎకనామిక్స్ లెక్చరర్, గద్వాల

అన్ని వర్గాలకు సమన్యాయం



అచ్చంపేట టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అన్ని రంగాల్లో సమ్మిళిత వృద్ధిని సాధించేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ఉంది. బడ్జెట్‌లో విద్య, వైద్యం, వ్యవసాయానికి కేటాయింపులు మరింత అవసరం. ప్రభుత్వం అనుత్పాదక వ్యయానికి ప్రాధాన్యం ఇచ్చింది. నిరుద్యోగం, పేదరికాలను నివారించే దిశగా లేదు.

- అనిల్, ప్రగతి కళాశాల అధ్యాపకుడు, అచ్చంపేట

విద్యారంగానికి సముచిత స్థానం



కోస్గి, (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యాశాఖకు సముచిత స్థానం కల్పించింది. విద్యాభావృద్ధికి కేటాయించిన రూ. 23,108 కోట్లను పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక వసతుల కల్పన, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, పేద విద్యార్థుల సంక్షేమానికి వినియోగిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

- హన్మంతు, బీఎస్సీ, బీఈడీ, నిరుద్యోగి, కోస్గి

వ్యవసాయానికి మరింత ఊతం



బడ్జెట్‌లో వ్యవసాయానికి మరింత ఊతం కలిగించేలా నిధుల కేటాయింపు జరిగింది. వ్యవసాయ రంగంలో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకొస్తే బాగుంటుంది. ఈ రంగంలో సంస్కరణలు తెచ్చేందుకు వీలుగా ఉంటుంది. తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

- నరసింహ, రైతు, కోస్గి


ఎస్సీల సంక్షేమానికి ప్రాధాన్యం



కోస్గి రూరల్ (ఆంధ్రజ్యోతి) : బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమానికి అధిక మొత్తం నిధులు కేటాయించి ప్రాధాన్యం కల్పించింది. కేటా యించిన 40,232 కోట్ల మొత్తాన్ని ఎస్సీల అభ్యు న్నతికి వినియోగించాలి. వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాల్లో వెలుగులు నింపేందుకు, చైతన్యం కలిగించేందుకు ఉపయోగపడాలి.

- నర్సింహులు, పీజీ, గుండుమాల్

సామాజిక సంక్షేమానికి పెద్దపీట



నారాయణపేట (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో సామాజిక సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఆరు గ్యారంటీల అమలుకు రూ. 56 వేల కోట్లు కేటాయించింది. ప్రతీ నియోజకవర్గానికి ఒక నాలెడ్జ్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఐటీఐ కళాశాలలను ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల గ్రామీణ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వ్యవసాయానికి గత బడ్జెట్ కంటే కేటాయింపులు తగ్గాయి. విద్యాశాఖకు 7.5 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. ఉన్నత విద్య, వైద్యం, ఆరోగ్యశాఖలకు కేటాయింపులు ఇంకా కాస్తా పెంచితే బాగుండేది.

- విశ్వనాథ్ మాంద్రే, అర్థశాస్త్ర అధ్యాపకుడు, నారాయణపేట.

వ్యవసాయ రంగాన్ని విస్మరించడం తగదు



బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించడం తగదు. కేవలం 24 శాతం నిధులు కేటాయించి వివక్ష చూపింది. రైతుభరోసా, రుణ మాఫీ, రైతు బీమా తదితర పథకాలపై నిర్లక్ష్యంతో అన్నదాతల ఆశలు అడియాశలు అవు తున్నాయి. సన్నరకం వరికి రూ. 500 బోనస్ ఇవ్వ డం కాస్తా ఊరట కలిగిస్తోంది. ఇలాగే అన్ని పంటలకు బోనస్ వర్తింప చేయాలి. అందరికీ రైతు భరోసా వర్తింపచేయాలి.

- వెంకోబా, బీకేఎస్, జోనల్ కార్యదర్శి, నారాయణపేట

బీసీలపై మళ్లీ వివక్ష



కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేసిన కులగణనలో 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 3.7 శాతం నిధులు కేటాయిస్తే ఏం న్యాయం జరిగిందనుకోవాలి. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి బీసీలపై మరోసారి వివక్ష చూపడమే. రాష్ట్ర శాసన సభలో ఉన్న అన్ని పార్టీల బీసీ ఎమ్మెల్యేలు కనీసం బడ్జెట్‌పై దృష్టి పెట్టలేదు. బడ్జెట్ రూపకల్పనలో బీసీలకు ప్రాధాన్యం దక్కేలా చూడలేకపోవడం దౌర్భాగ్యం. బడ్జెట్‌లో నిధులు పెంచే విధంగా ఆలోచించాలి.

- మల్లేష్‌యాదవ్, ఎకనామిక్స్ లెక్చరర్, కల్వకుర్తి డిగ్రీ కళాశాల

అభివృద్ధి నిరోధకం



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, (ఆంధ్రజ్యోతి) : విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం అభివృద్ధి నిరోధకం. బడ్జెట్‌లో విద్యారంగానికి 7.5 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రంలో 12.5 శాతం కేటాయింపులు ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏటా క్రమంగా తగ్గిస్తున్నారు. గతం ప్రభుత్వంలో 6.5 శాతం ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం 7.5 శాతం బడ్జెట్ కేటాయించింది.

- శ్రీశైలం, డీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు, మహబూబ్‌నగర్

క్రైం కార్నర్

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

ఊర్కొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామంలో గత నెల చివరి వారంలో మాజీ సర్పంచ్ పర్వత్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బైకుపై వెళ్తున్న బాషమోని సైదులు అనే వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించాడు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. అతడు కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన వాడని, అతడే చోరీకి పాల్పడ్డాడని గుర్తించారు. మాజీ సర్పంచ్ వీరెడ్డి పర్వత్‌రెడ్డి ఇంట్లో చోరీ చేసిన దాదాపు రూ.4.80 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను తన సోదరి శశికళకు అప్పగించినట్లు నిందితుడు తెలిపాడు. దీంతో అతడిని అరెస్ట్ చేసి, బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

బాలికపై అత్యాచారయత్నం

» నిందితుడికి రిమాండ్

మద్దూర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నం కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ విజయకుమార్ తెలిపిన కథనం ప్రకారం.. నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండలం, బల్లునాయక్ తండాకు చెందిన ధనావత్ పవన్‌కుమార్ (23) మద్దూర్ మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక (17)తో ఇన్‌స్టాగ్రామ్ లో పరిచయం చేసుకున్నాడు. ప్రేమ పేరుతో నమ్మించి, అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలి అన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు చేపట్టి పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేశారు. బుధవారం కోస్గి కోర్టులో హాజరు పరచగా, అతడికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ సైదులు, ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డులో బుధవారం ఈ సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం, శాఖాపూర్ గ్రామానికి చెందిన మధుసూదన్ పాన్‌గల్‌లో సీసీ కెమెరాలు బిగించేందుకు ద్విచక్రవాహనంపై జయకృష్ణ అనే వ్యక్తితో కలిసి వెళ్తున్నాడు. అదే సమయంలో కదిరెపాడు గ్రామంలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణ నాయక్ కారులో వనపర్తికి వస్తున్నాడు. పాన్‌గల్ రోడ్డు సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో మధుసూదన్ కాలు విరిగింది. అతడిని అంబులెన్సులో జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతి

» బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

» కల్వకుర్తి ఆసుపత్రి ముందు ఆందోళన



కల్వకుర్తి ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు, బంధువులు

కల్వకుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాలింత శ్యామల మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. కల్వకుర్తి నియోజకవర్గం, తలకొండపల్లి మండలం, రాంపూర్ గ్రామానికి చెందిన శ్యామల రెండవ కాన్పునకు సిజేరియన్ చేయగా, మంగళవారం మృత్యువాత పడింది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ముందు బుధవారం ఆందోళన చేపట్టారు. వారికి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు మద్దతు ప్రకటించారు. మాజీ మంత్రి జె.చిత్తరంజన్ దాస్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి బాధితులను పరామర్శించారు. కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని బీజేపీ, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బ్యాంగి ఆనంద్‌కుమార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. పిల్లలను చదివిస్తానని, శ్యామల భర్తకు కాంట్రాక్ట్ ఉద్యోగం వచ్చేలా చూస్తానని చెప్పారు. ఈ విషయాన్ని ఆయన ఆందోళనకారులకు తెలిపి, కొంత ఆర్థిక సాయం అందించడంతో వారు ఆందోళన విరమించారు. సంఘీభావం తెలిపిన వారిలో బీజేపీ నాయకులు మొగిలి దుర్గాప్రసాద్, రాంభూపాల్‌రెడ్డి, సురేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, సీపీఎం నాయకుడు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

పట్ట పగలే చోరీ

చారకొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండల కేంద్రంలో పట్టపగలే చోరీ జరిగింది. ఎస్‌ఐ శంషొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొంపల్లి సరిత ఇంటికి తాళం వేసి, తాళం చెవిని, సజ్జపై పెట్టి బయటకు వెళ్లింది. విషయాన్ని గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం తీసి ఇంట్లోకి ప్రవేశించారు. పడక గదిలోని డ్రస్సింగ్ టేబుల్ డ్రాలో ఉన్న 13 గ్రాముల బంగారు నగలు, 30 తులాల వెండి గొలుసులు, రూ.15 వేల నగదును ఎత్తుకెళ్లారు. తర్వాత తలుపులకు తాళం వేసి, తాళం చెవిని సజ్జపై పెట్టి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్ది సేపటికి వచ్చిన సరిత ఇంట్లోకి వెళ్లే సరికి పడక గదిలో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించింది. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంపు సీజ్



ఇసుక డంపులను సీజ్ చేస్తున్న అధికారులు

మిడ్జిల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వ ం ం డ లం లో ని కొత్తపల్లి గ్రామ శివారులో గల ఊర చెరువు పరిసర ప్రాంతంలో ఉన్న ఇసుక డంపులను గుర్తిం చిన తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు బుధవారం సీజ్ చేశారు. అంతకుముందు అయ్యవారిపల్లి గ్రామ శివారులోని దుందుభీ వాగు పరివాహక ప్రాంతంలో నిల్వ చేసిన ఇసుకను పరిశీలించారు. సీజ్ చేసిన ఇసుకను డీడీలు కట్టిన వారికి అనుమతి ఇస్తామని తెలిపారు.

కారు ఢీకొని రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

తాడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పొలం నుంచి ఇంటికి వస్తున్న రైతు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలోని గుంతకోడూరు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు చంద్రయ్య (32) బుధవారం సాయంత్రం ఇంటికి వస్తూ, రోడ్డు దాటుతుండగా, కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న కారు ఢీకొనడంతో చంద్రయ్య తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు అతడిని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఘటనకు సంబంధించి తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు.

వైన్స్ షాప్‌లో చోరీ

గండీడ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన గండీడ్‌లో మంగళవారం అర్ధరాత్రి వైన్స్ షాప్‌లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. రూ.6 వేల మద్యం బాటిళ్లు దొంగతనం జరినట్లు తెలిపారు. బుధవారం వైన్స్ యాజమాని జనార్దన్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

బహిరంగ సభ జయప్రదం చేయాలి

రేవల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 23న వనపర్తి పట్టణంలో నిర్వహించే బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని తలుపునూరులో కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా కార్యదర్శి విజయరాములు మాట్లాడుతూ ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

చిన్నంబావి, మార్చి19(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దదగడ సమీపంలో పెద్దమారూర్ చెందిన నాగేశ్వర్‌రావు బైక్‌పై వనపర్తికి వెళ్తుండగా అదుపు తప్పి కింద పడి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆయనను మండల కేంద్రానికి తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలతో పాటు జైలు శిక్ష ఉంటుందని ఎస్‌ఐ నరేందర్ సూచించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తాలో వాహనదారులకు బుధవారం అవగాహన కల్పించారు. ప్యాసింజర్ ఆటో యజమానులు పరిమితికి మించి ఎక్కించుకుని ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చెప్పారు. తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్, బాలరాజు, రమేష్, రామకృష్ణ, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో ముస్లింలకు అన్యాయం'

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ముస్లింలకు అన్యాయం చేసిందని బీఆర్ఎస్ నాయకుడు షేక్ జహంగీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి రాగానే ముస్లింలకు రూ.4వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని డిక్లరేషన్ సభలో చెప్పారని తెలిపారు. ముస్లిం మైనార్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని చెప్పి హామీని విస్మరించారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత, మహిళల ఉపాధి కోసం రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని తెలిపారు. విద్యార్థులకు అబ్దుల్ కలాం తోఫా కింద రూ.5లక్షల సాయం చేస్తామని హామీ నిలబెట్టుకోలేదని తెలిపారు. రాష్ట్రంలో 14 శాతం ఉన్న ముస్లింలకు మంత్రి లేకపోవడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బార్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ నియామకం

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కోర్టులో బార్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ సభ్యులను నియమిస్తూ బుధవారం రాష్ట్ర బార్ కౌన్సిల్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీనియర్ న్యాయవాదులు తెలిపారు. సభ్యులుగా వనపర్తికి చెందిన మోహన్‌గౌడ్, కృష్ణమోహన్‌ను ఎంపిక కావడంతో బుధవారం బార్ అసోసియేషన్ హాల్‌లో వారు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఎన్నికలు నిర్వహించి కొత్త అధ్యక్షుడి ఎంపిక జరిగే వరకు సభ్యులుగా వ్యవహరిస్తారని తెలిపారు. హేమవర్ధన్‌రెడ్డి, మోహన్‌కుమార్, భూజల వెంకటేశ్వరరెడ్డి, భరత్‌కుమార్, తిరుపతయ్యగౌడ్, కిరణ్‌కుమార్, తిరుపతయ్య, రామ్ దూళి పాల్గొన్నారు.

'దుష్ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి'

వనపర్తి క్రైమ్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్‌పై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జేఏసీ పట్టణ అధ్యక్షుడు దేవర శివ కోరారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పెబ్బేరు ఎస్‌ఐ ఓ వ్యక్తితో కావాలనే ఫిర్యాదు తీసుకుని ఈనెల 15వ తేదీన 11 మందిపై అక్రమంగా క్రిమినల్ కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో అంజన్న యాదవ్, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

కొత్తకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పరాల ఉన్నత పాఠశాలలో బుధవారం రిటైర్డ్ ఉపాధ్యాయుడు మహేశ్వర్‌రెడ్డి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే ప్రప్రథమమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీరాం జంబులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఇంకిన బోర్లు.. ఎండిన పైర్లు

» లబోదిబోమంటున్న రైతులు

» పంట చేతికొచ్చే సమయంలో తీవ్ర నష్టం



వెనికితండాలో ఎండిన వరి పైరును చూపుతున్న రైతులు



కర్నేతండాలో ఎండిన వరి పైరు

ఖిల్లాఘణపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు ఇంకిపోయి, బోరు బావుల్లో నీరు తగ్గడంతో పైర్లు ఎండిపోయాయి. బోరు బావులపై నమ్మకంతో రైతులు యాసంగి పంటను సాగు చేసి పంట చేతికొచ్చే సమయంలో బోర్లలో నీరు రాకపోవడంతో నష్టాల బారినపడేలా చేస్తుంది. మండలంలోని మామిడిమాడ వెనికితండాలో గిరిజన రైతు కేతావత్ ముత్యాలు, భార్య జమ్ములు తమకు ఉన్న రెండు ఎకరాల్లో బోరు బావి కింద వరి పంటను సాగు చేసి రూ.60 వేలు పెట్టుబడి పెట్టారు. పంటకు చివరగా ఒక్క తడికి బోరులో నీరు రాకపోవడంతో పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీర్చలేక పోతున్నామని తెలిపారు. మండలంలోని కొత్తపల్లితండా, రుక్కన్నపల్లి, గట్టుకాడిపల్లి, ఖిల్లాఘణపురం శివారులో బోరు బావుల కింద సాగు చేసిన వరి నీటి లభ్యత సరిపోకపోవడంతో ఎండిపోయి భూములు బీటలు వారుతున్నాయి. చేతికి వచ్చిన పంట కళ్ల ఎదుటే ఎండిపోతుందని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారి మల్లయ్య మాట్లాడుతూ.. బోరు బావుల కింద వేసిన యాసంగి పంట ఎండల తీవ్రతతో ఎండిపోతున్నట్లు రైతులు మా దృష్టికి తెస్తున్నారని తెలిపారు. పంట చేతికి వచ్చే సమయంలో నీటి తడి సరిపోవడం లేదని, దీంతో పంటలు ఎండి పోతున్న సంఘటనలు ఉన్నాయన్నారు.

గిరిజనుల భూ హక్కుల కోసం ఉద్యమిస్తాం

» బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్



రైతులతో మాట్లాడుతున్న ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్

ఖిల్లాఘణపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ జీవనాధార గిరిజన రైతులకు ప్రభుత్వం భూములపై హక్కులు కల్పించి న్యాయం చేయాలని బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ డిమాండ్ చేశారు. మండలంలోని వెనికితండాలో బుధవారం తరతరాలుగా సాగు చేస్తున్న భూములకు పట్టాల కోసం ఆందోళన చేస్తున్న గిరిజన రైతులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మామిడిమాడ, షాపూర్ శివారు ప్రాంతాలలోని రాజా బహదూర్ కుటుంబానికి చెందిన భూములు సుమారు 463 ఎకరాల భూమిని 150ఏళ్లుగా గిరిజన రైతులు సాగు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం తెచ్చిన సీలింగ్ యాక్టు ప్రకారం 12 ఏళ్లుగా దున్నే వాడికే భూమి అనే నిబంధన ఉన్న గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు గిరిజన రైతుల ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. గిరిజనుల గోడును జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లి అధికార యంత్రాంగంతో సర్వే చేయించి అర్హులైన వారికి భూ పట్టాలు ఇప్పించడానికి కృషి చేస్తామని అన్నారు. ధరణిలో అవకతవకలకు పాల్పడి 100 ఎకరాల భూ కుంభకోణంలో మాజీ మంత్రి పాత్ర ఉందని, భూ ఆక్రమణలను అడ్డుకుంటామని తెలిపారు.ఈ రవి నాయక్, బుచ్చిబాబుగౌడ్, రామన్‌గౌడ్, దశరథ్, గోపాల్‌రెడ్డి, సక్రునాయక్ రైతు లు పాల్గొన్నారు.

గిరిజనులకు మోసం చేశారు

వనపర్తి అర్బన్: జిల్లాలో గిరిజనుల సాగు భూముల పట్టాలు సాధించే వరకు బీజేపీ పోరాడుతుందని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి 2018 ఎన్నికల్లో గెలిస్తే పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చి గెలిచాక మోసం చేశారని మండిపడ్డారు. మేఘారెడ్డి గెలిచి 15 నెలలు అయినా గిరిజనుల సమస్యలపై ఆలోచించే తీరిక లేదన్నారు.

ప్రజా ఆమోద బడ్జెట్ : ఎమ్మెల్యే

వనపర్తి టౌన్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క రూపొందించిన బడ్జెట్ అన్ని రంగాలకు ఆమోదయోగ్యంగా ఉందని, అన్ని రంగాలను త్వరితగతిన అభివృద్ధిపరిచేందుకు ఈ బడ్జెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ రంగం, నీటిపారుదల రంగం, గ్రామీణ అభివృద్ధి రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించారని, బడ్జెట్ హర్షించదగిన విషయమని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి

పాన్‌గల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ సరుకులను సకాలంలో ప్రజలకు అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి డీలర్లను హెచ్చరించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. డీలర్లు తమ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని, ప్రతీ నెల సకాలంలో డీడీలు తీయాలన్నారు. కార్యక్రమంలో డీటీ అశోక్, శివరాం గుప్తా, రాఘవేందర్, సుదర్శన్, శ్రీను, మన్యం, శివయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి



ఆత్మకూరు గాంధీ చౌరస్తాలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

» ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల వారి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడిందని, అది మరోసారి రుజువైందని పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు అన్నారు. బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రహమతుల్లా, తులసిరాజ్, రామలక్ష్మారెడ్డి, గణేష్, నగేష్, దామోదర్, శ్రీనివాసులు, ఆరేపల్లి శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవల్లి: బీసీ రిజర్వేషన్ 42 శాతం, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపిన సందర్భంగా బీసీ, ఎస్సీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని చీరకపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మల్లేష్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పరశురాం, వెంకటస్వామి, రాముడు, కాశీ మల్లయ్య, కోటయ్య, రాజేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లు చరిత్రాత్మకం

కొత్తకోట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లు చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బీమపల్లి యాదవ్, శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్ర పటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, వెంకటేశ్వర్లు చంద్రశేఖర్‌రెడ్డి, బోయోజ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పీజే. బాబు, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



గొడుగులను పంపిణీ చేస్తున్న జేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

కొత్తకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారులకు జేఎస్ రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గొడుగులను పంపిణీ చేశారు. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సతీష్‌రాజు, కర్ణ కుమార్, ఇజ్రాయిల్, కల్యాణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అమరచింత, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజు, ప్రసాద్ తెలిపారు. బుధవారం అమరచింత మార్క్స్ భవనంలో టీయూసీఐ మూడో మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. కార్మికులకు ఇచ్చే సంక్షేమ పథకాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న జరిగే రాష్ట్ర మహాసభలను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిలాని, రాజన్న, సామేల్, కురుమన్న, భక్తరాజ్, మసలమని, సత్యనారాయణ, ప్రేమరత్నం, పాషా పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

అమరచింత, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కమిషనర్, సీపీఎం నాయకులు పరస్పరంగా ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్‌ఐ సురేష్ విచారణ చేపట్టారు. మాజీ వైస్ చైర్మన్ జీఎస్ గోపి కులం పేరుతో దూషించారని మునిసిపల్ కమిషనర్ ఫిర్యాదు చేయగా, కమిషనర్‌తో పాటు మేనేజర్, వార్డు అధికారి కులం పేరుతో దూషించారని సీపీఎం ఆత్మకూరు మండల కార్యదర్శి రాజు పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. ఈ ఘటనపై మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఫిల్టర్ ఇసుక డంపులు ధ్వంసం



ఇసుక డంపులను ధ్వంసం చేయిస్తున్న అధికారులు

గోపాల్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో అక్రమ ఇసుక ఫిల్టర్ డంపులను బుధవారం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ధ్వంసం చేశారు. చెన్నూరు వాగు సమీపంలో మండల కేంద్రానికి చెందిన గొల్ల గొల్లయ్య, మాల సురేందర్, గంగారం నరసింహులు పొలాల్లో ఫిల్టర్ ఇసుక నిల్వలను తహసీల్దార్ తిలక్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేష్ కుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో ధ్వంసం చేయించారు. ఫిల్టర్ ఇసుకకు ఉపయోగించే మోటార్ స్టార్టర్ డబ్బాలు, వైరు, పైపులను రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మళ్లీ ఫిల్టర్ ఇసుక దందాను కొనసాగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తహసీల్దార్ తెలిపారు. సుమారు 80 ట్రిప్పుల ఇసుక డంపులను గుర్తించినట్లు పేర్కొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శన

అమరచింత, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న కడుమూరులో చింతల ముని రంగస్వామి నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. బుధవారం పెద్ద కడుమూర్ చెందిన శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో 28 మందితో కూడిన కళాకారుల బృందం నాటక ప్రదర్శన సభలో తమ పాత్రలతో అలరించారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

» కలెక్టర్ ఆదర్శ్ సురభి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ వరి కొనుగోలు చేసేందుకు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏప్రిల్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మార్చి 25 లోపు బరువు కొలిచే, తేమ కొలిచే మిషన్లు అందుబాటులోకి తెచ్చుకోవాలని మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. అంతేకాకుండా రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇస్తేనే వారికి ధాన్యం కేటాయించడం జరుగుతుందని, ఇవ్వని వారికి ఉండబోదని స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, డీఆర్‌డీవో ఉమాదేవి, పౌర సరఫరాల శాఖ అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం సివిల్ సప్లయ్ జగన్, జిల్లా సహకార శాఖ అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లను గుర్తించాలి

జిల్లాలో స్థానిక అవసరాలకోసం అందుబాటులో ఉన్న ఇసుక రీచ్‌లను పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లాస్థాయి శాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్థానిక అవసరాల మేరకు ఇసుక వాడుకోవడానికి అందుబాటులో ఉన్న రీచ్ నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

నెలాఖరులోపు ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులందరూ ఈ నెలాఖరులోపు నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ యాదయ్యతో కలిసి తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వెబెక్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఇంటి నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు చేసే పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, చలువ నీడ ఇతర ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

మహిళా లోకానికి ఆదర్శం మల్లు స్వరాజ్యం



అజ్జకొల్లులో నివాళి అర్పిస్తున్న ఐద్వా సభ్యులు

మదనాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహిళా లోకానికి మల్లు స్వరాజ్యం ఆదర్శంగా నిలిచారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు సాయిలీల అన్నారు. బుధవారం మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా మండలంలోని అజ్జకొల్లులో చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. రెండుసార్లు తుంగతుర్తి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం జరిగిందని, ఆ సమయంలో అసెంబ్లీలో మహిళలకు మరుగుదొడ్లు కావాలని పోరాటం చేశారని, ఆమె పోరాటం ఫలితంగానే నేడు ఇంటింటికి వ్యక్తిగత మరుగుదొడ్లు రావడం జరిగిందన్నారు. మల్లు స్వరాజ్యం బాటలో సమాజహితం కోసం మహిళలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతి, లక్ష్మి, రమాదేవి, భాగ్య, రేణుక, సుజాత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు నిర్మించాలి

మదనాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుప్పల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో దుప్పల్లి, కొన్నూరుతండాలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుప్పల్లిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక రెండు అద్దె భవనాలలో, మరొకటి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారని అన్నారు. అదేవిధంగా పశు వైద్యశాలకు సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. అల్లీపురం బ్రిడ్జి వద్ద ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల ద్వారా 70 ఎకరాలకు సాగు నీరు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్నూరు పెద్దతండాలో తాగునీరు లేక తండావాసులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే మిషన్ భగీరథ నీరు శాశ్వతంగా వచ్చే విధంగా చూడాలన్నారు.

భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం

ఆత్మకూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకుని బానిసత్వం నుంచి విముక్తి పోరాటాలు చేపట్టాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కృష్ణ అన్నారు. ఈనెల 23న భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో భగత్‌సింగ్ విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా పట్టణంలోని బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. దేశం నుంచి పరాయి పాలకులైన బ్రిటీష్ వారు వెళ్లిపోవాలని, మనమే పరిపాలించుకోవాలని, సహజ వనరులను వినియోగించుకుని స్వతంత్రంగా జీవించాలని ఉద్యమించిన మహనీయుడు భగత్‌సింగ్ అని గుర్తు చేశారు. 23న మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే భారీ బహిరంగ ర్యాలీకి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.సూర్యం, ప్రసాద్, హనుమంత్, రాజు, రాజన్న, అంజి, భాస్కర్ పాల్గొన్నారు.

ఒక కవిత్వం లక్ష మందికి మేల్కొలుపు



వీరనాగు శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గోపాల్‌పేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఒక కవిత్వంతో లక్ష మందినైనా మేల్కొలపవచ్చని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బుద్దారం చెందిన చిక్కుడు రవి రచించిన వీరనాగు శతకం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. చిక్కుడు రవి చిన్న వయసులోనే వీరనాగు పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. చిన్ననాటి నుంచి తాను పెరిగిన పరిస్థితులను, గ్రామీణ ప్రజల కష్టాలను క్లుప్తంగా చూస్తూ, వర్షంపై ఆధారపడే వ్యవసాయాన్ని చూసి చలించిపోయిన నేను అపర భగీరథ ప్రయత్నంతో కృష్ణ జలాలు తీసుకొచ్చిన వైనాన్ని రవి వివరించారని కొనియాడారు. వీరనాగు శతకం సామాజిక శతకంగా చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. అనంతరం పుస్తకాన్ని రచించిన చిక్కుడు రవిని సన్మానించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, మాదిరే మల్లమ్మ, డాక్టర్ శిఖామణి, డాక్టర్ కోటేశ్వరరావు, నాగవరం బాలరాం, రామ్మూర్తి, అమర్‌నాథ్, వహీద్ ఖాన్, విప్లవ్, నందిమల్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో పదో తరగతి ఒక మైలురాయి



గోపాల్‌పేటలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మదనాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి జీవితంలో పదో తరగతి ఒక మైలురాయి లాంటిదని ఎంఈవో ఫారుక్‌హుస్సేన్ అన్నారు. బుధవారం మండలంలోని అజ్జకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇష్టపడి చదివి ఉన్నత స్థానం పొందాలన్నారు. దాతల సహకారంతో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణగౌడ్, ఆంజనేయులు, లక్ష్మయ్య, ధ్రువకుమార్, శ్యాంప్రసాద్, రజిత, పద్మావతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం విజయ, వీరమణి, రమాదేవి, చెన్న పద్మ, షబానా, సునీత, ప్రవీణ, లక్ష్మి పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పదో తరగతి ఫలితాల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం చంద్రశేఖర్ విద్యార్థులను సూచించారు. బుధవారం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ (హరిజనవాడ) పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.